క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

గొలుగొండ : ఏజెన్సీ ముఖద్వారం అయిన కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా వాహన తనిఖీలు జరుగుతున్నాయి. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు రవాణా జరగకుండా అన్ని చర్యలు చేపడుతున్నారు. కృష్ణదేవిపేట, గొలుగొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎస్పీ మురళీకృష్ణకు మొక్క అందజేస్తున్న డీఎస్పీ మోహన్

నర్సీపట్నం: నర్సీపట్నం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జి.ఆర్.ఆర్. మోహన్ గురువారం జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణను కలిసి మొక్క అందజేశారు. జి.ఆర్.ఆర్. మోహన్ ఏలూరు ఏసీబీ డీఎస్పీగా పని చేస్తూ, బదిలీపై నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



అచ్చెంనాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం : వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం పరామర్శించారు. గాంధీ గ్రామానికి చెందిన గృహసారథి శిలపరశెట్టి అచ్చెంనాయుడు ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే ధర్మశ్రీ పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు గ్రామ సర్పంచ్ గాడి అప్పారావు, ఎంపీపీ గాడి కాసు, హైస్కూల్ కమిటీ చైర్మన్ దాడి జగదీష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

మాడుగుల : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ప్రతి ఓటరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని స్థానిక ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కె. రాజా పేర్కొన్నారు. ఎస్‌వీఈఈపీ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక వారపు సంతలో వ్యాపారులు, వినియోగదారులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎన్నికల సీనియర్ సహాయకులు వి. పూర్ణయ్య, ఆర్.ఐ. వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య మెలకువలపై అవగాహన సదస్సు

మాడుగుల రూరల్ : జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెలకువలపై మాడుగుల అగ్రి ల్యాబ్ ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సుకు పాడేరు డివిజన్ పశు వైద్యశాఖ ఉప సంచాలకులు డాక్టర్ సి.హెచ్. నరసింహులు హాజరయ్యారు. లింగ నిర్ధారిత వీర్యానికి సంబంధించి పశు విజ్ఞాన బడుల నిర్వహణ, రైతు భరోసా కేంద్రాల గ్రేడింగ్, అంబులెన్స్ సేవలపై సమీక్షించారు. స్థానిక పశు వైద్యశాఖ సహాయ సంచాలకులు వి. చిట్టినాయుడు, మాడుగుల, చీడికాడ, మండలాలకు చెందిన పశు వైద్యాధికారులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

3న ఘాట్‌రోడ్డు మోదమాంబ పాదాల తీర్థం

మాడుగుల రూరల్ : ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో గల మోదకొండమ్మ అమ్మవారి పాదాల తీర్థానికి సంబంధించిన గోడపత్రికను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గురువారం తారువ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు డిప్యూటీ సీఎంను తీర్థానికి రావాలని సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇక పల్లెలు ప్రకాశవంతం

- రూ. 10 కోట్లతో అదనపు విద్యుత్ లైన్లు
- ఇళ్లు, వ్యవసాయానికి వేర్వేరుగా సరఫరా
- లోఓల్టేజీ సమస్య ఉన్న గ్రామాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- కొత్త లైన్ల ఏర్పాటుతో గిరిజన గ్రామాలకు 3 ఫేజ్ కరెంట్ సరఫరా



సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కోసం నిర్మిస్తున్న దిమ్మ





గిరిజన గ్రామాలకు వేస్తున్న కొత్త విద్యుత్ లైన్లు

అభివృద్ధి, సంక్షేమం అందిస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్ పట్టణాలతో పాటు పల్లెలనూ పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతున్నారు. మారుమూల పల్లెలకు కూడా సంక్షేమం అందిస్తూ గిరిజన ప్రాంత ప్రజలు కోరుకునే మౌలిక సదుపాయాలు అందిస్తున్నారు. అందులో భాగంగా నరుగుడు రామన్నపాలెం, అచ్చంపేట, రాజవరం, దద్దుగుల, యరంకంపేట, మాసంపల్లి, సుందరకోట, అసనగిరి, తోరడ, కొత్త దద్దుగుల, శిరిపురం, ముంతమామిడిలొద్దు, కొత్త లంకలు, బమ్మిడికలొద్దు గ్రామాలకు కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తూ వెలుగుల ద్దుతున్నారు. తమ ఉన్నతికి సీఎం జగన్ తీసుకుంటున్న చర్యలకు గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాతవరం : గిరిజన గ్రామాల్లో విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకు గాను రూ. 10 కోట్లతో విద్యుత్ లైన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి ఇళ్లు, వ్యవసాయ లైన్లకు వేర్వేరుగా అందించేందుకు కొత్త లైన్లు వేస్తున్నారు. మండల కేంద్రంలో 1999లో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, 2011లో చినగొలుగొండపేట, 2016లో గన్నవరం ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. మండలంలో వ్యవసాయం, పరిశ్రమలు, ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు మొత్తంగా 18,920 కనెక్షన్లు ఉన్నాయి. అయితే కనెక్షన్లకు తగ్గట్టుగా విద్యుత్ సరాఫరా కాకపోవడంతో గత కొంత కాలంగా వినియోగదారుల నుంచి ఒత్తిడి వస్తోంది. ఇంత వరకు అన్ని రకాల విద్యుత్ అవసరాలకు ఒకే లైన్ ఉండేది. దీని వల్ల ఈదురు గాలుల సమయంలో ఎక్కడ సరఫరాలో లోపం ఉన్నా పూర్తిగా విద్యుత్ సరఫరా ఆగిపోతోంది. దీంతో అన్ని ప్రాంతాల్లోను విద్యుత్ సరఫరా కాక ఇబ్బందులు తలెత్తేవి. ఇప్పుడు కొత్తగా వేసే విద్యుత్ లైన్‌తో ఇళ్లు, వ్యవసాయానికి వేర్వేరుగా విద్యుత్ సరఫరా అందనుంది. వ్యవసాయానికి 9 గంటలు సరఫరా పూర్తయ్యాక దానంతట అదే నిలిచిపోతుంది. ప్రస్తుతం ఇళ్లకు విద్యుత్ ఇవ్వాలంటే మిగతా వాటికి సరఫరా ఆగిపోవడం.. అలాగే పరిశ్రమలకు సరఫరా కావాలన్నా అలాగే జరుగుతుండడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనిని అధిగమించేందుకు అధికారులు కొత్తగా వేస్తున్న లైన్‌తో సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అలాగే తరచూ ఎదుర్కొనే విద్యుత్ అంతరాయం ఇబ్బంది కూడా తొలగిపోనుంది. ఇక లోఓల్టేజీ సమస్య ఉన్న 10కి పైగా గ్రామాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో అక్కడ సమస్య పరిష్కరించినట్లు అయింది. ఇదే సమస్య ఉన్న మరో మూడు గ్రామాలకు కూడా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. వేసవిలో లోఓల్టేజీ సమస్య పరిష్కరించేందుకు నాతవరం సబ్‌స్టేషన్‌లో రూ. కోటి 20 లక్షలతో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కావడంతో దానిని నిర్దేశించిన చోట అమర్చేందుకు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి.

గిరిజన ప్రాంతాలకు 3 ఫేజ్ విద్యుత్..

ఇంత వరకు ఏజెన్సీలోని గిరిజన గ్రామాలకు సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా మాత్రమే అందుతోంది. నరుగుడు రామన్నపాలెం, అచ్చంపేట, రాజవరం, దద్దుగుల, యరంకంపేట, మాసంపల్లి, సుందరకోట, అసనగిరి, తోరడ, కొత్త దద్దుగుల, శిరిపురం, ముంతమామిడిలొద్దు, కొత్త లంకలు, బమ్మిడికలొద్దు గ్రామాలకు కొత్తగా విద్యుత్ లైన్లు పూర్తి అయితే 3 ఫేజ్ విద్యుత్ సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్ వల్ల కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉంది. కొండలపై నుంచే ఎక్కువగా విద్యుత్ లైన్లు ఉండటంతో ఏమాత్రం గాలులు వీచినా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గిరిజనులు వాపోతున్నారు.



లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు

యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నాం..



సబ్‌స్టేషన్‌కు రూ. కోటి 20 లక్షల విలువైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైంది. అది ఏర్పాటు చేసేందుకు పనులు చేస్తున్నాం. లోఓల్టేజీ సమస్య ఉన్న గ్రామాల్లో అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం. కొత్త లైన్ల ఏర్పాటు పనులు పూర్తి అయితే ఇళ్లకు, వ్యవసాయానికి వేర్వేరుగా విద్యుత్ సరఫరా జరుగుతుంది. గిరిజన గ్రామాలకు 3 ఫేజ్ విద్యుత్ సరఫరా చేయగలుగుతాం.

– చంద్రమౌళి, విద్యుత్ శాఖ జేఈ, నాతవరం

తగ్గిన కోనాం చింతపండు ధర

చీడికాడ : మండలంలోని కోనాం సంతకు గురువారం చింతపండు భారీ స్థాయిలో వచ్చింది. ఇప్పుడిప్పుడే గిరిజనులు కొత్త చింతపండును సంతకు తెస్తుండడంతో చింత పండు ధర గతవారం కంటే తగ్గింది. 30 కిలోల మొదటి రకం కావిడి చింతపండు గతవారం రూ. 16 వందల నుంచి రూ. 2 వేల వరకు పలకగా ఈ వారం రూ. 12 వందల నుంచి రూ. 16 వందలకు అమ్ముడైంది. దీంతో కొనుగోలుదారులు ఎగబడ్డారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

మాకవరపాలెం : మండలంలోని ఎం.నగరంలో తాగునీటి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు అధికారులను కోరారు. ఈ గ్రామంలో ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదని గురువారం ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివారెడ్డికి వినతిపత్రం అందించారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

మాకవరపాలెం : ఉగాది పురస్కారాల్లో భాగంగా గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రంగరాజు, శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఏటా వివిధ పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రామచంద్రపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు

కె.కోటపాడు : రామచంద్రపురం గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల 133 మందికి పరీక్షలు చేశారు. అలాగే అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటున్న ఐదుగురి ఇళ్లకు వెళ్లి పరీక్షించారు. వైద్య సిబ్బంది రాజు, రమణ, చిన్నమ్మలు పాల్గొన్నారు.

ఎల్. గదబూరులో..

మాడుగుల రూరల్ : మండలంలోని ఎల్. పొన్నవోలు గ్రామ శివారు ఎల్. గదబూరు గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కేఎం నాయుడు 50 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, 104 సిబ్బంది శీరంరెడ్డి భార్గవ్, గంగాధర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

మాడుగుల రూరల్ : ఇంటర్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన 671 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నాగమోహిని గురువారం సాయంత్రం తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు 8 గంటలకే చేరుకోవాలన్నారు. గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సజావుగా పరీక్షల నిర్వహణ బాధ్యత ఇన్విజిలేటర్లదే

రోలుగుంట : పరీక్షల్లో కాపీయింగును అరికట్టాల్సిన బాధ్యత ఇన్విజిలేటర్లదే అని చీఫ్ సూపరింటెండెంట్ వసుదేవుడు అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించి పరీక్షల సమయంలో పరిశీలించాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు. మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లకు అనుమతి లేదన్నారు.

నూకాంబిక ఆలయ నిర్మాణానికి శ్రీకారం

కె.కోటపాడు : ఆనందపురం గ్రామంలో నూకాంబికా అమ్మవారి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. రూ.8 లక్షలు సమీకరించుకుని ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు సర్పంచ్ వంటాకు అప్పాజీ తెలిపారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

గొలుగొండ : ఏటిగైరంపేట గ్రామంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ ఆలయం నిర్మాణానికి కమిటీ సభ్యులు సుమారు రూ. 10 లక్షల వరకు నిధులు సమకుర్చుకున్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆర్‌సీవై పరమేశ్వరావు, ఆర్ఎస్ గోపాల్, క్లబ్ అధ్యక్షుడు శ్రీకాకుళం రమేష్ వనిత, వెంకటలక్ష్మి తదితరుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటిగైరంపేట గ్రామ పేదలకు బియ్యం, తువ్వాళ్లు అందజేశారు.

ఇంటర్ పరీక్షా కేంద్రంగా రోలుగుంట కళాశాల

రోలుగుంట : మార్చి 1 నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షల నిర్వహణకు రోలుగుంట జూనియర్ కళాశాలకు పరీక్షా కేంద్రం మంజూరు అయిందని ప్రిన్సిపాల్ సహదేవుడు తెలిపారు. ఈ కళాశాలలో పరీక్ష రాసేందుకు 227 మంది విద్యార్థులకు అనుమతి ఉందన్నారు. రోలుగుంట, కొత్తకోట, రావికమతం విద్యార్థులు ఇక్కడ పరీక్ష రాయనున్నారన్నారు. ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రంలో విద్యార్థులు రిపోర్టు చేయాలన్నారు.

త్వరితగతిన ఇంకుడుగుంత నిర్మాణానికి ఆదేశం

నాతవరం: ఆదమరిస్తే అంతే సంగతులు.. అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ఈ నెల 26న ప్రచురితమైన వార్తకు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగశిరీష వివరణ ఇచ్చారు. నాతవరం మండలం రామన్నపాలెం గ్రామంలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా 15 అడుగుల ఇంకుడుగుంత తవ్వారు. ఈ నెల 21న ఆశ్రమ పాఠశాలలో తనిఖీ సమయంలో ఇంకుడుగుంతను గమనించి విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున రెండు రోజుల్లో ఇంకుడుగుంత నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఈ విషయం ఫోన్ ద్వారా తెలియపరిచామన్నారు.

4న అడ్డసరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

రోలుగుంట : మార్చి 4న మండలంలోని అడ్డసరం సచివాలయం వద్ద రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్డీవో మల్లికార్జునరావు తెలిపారు. పలు విభాగాలకు చెందిన వైద్య నిపుణలు ఈ శిబిరంలో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నర్సీపట్నం : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. నాయకులు పడాల అప్పారావు, జిల్లా కార్యదర్శి కె.సత్యారావు మాట్లాడుతూ 12వ పీఆర్సీలో 30 శాతం భృతి వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్, డీఏల మొత్తాలను క్యాష్ రూపంలో చెల్లించాలన్నారు.

చోడవరంలో..

చోడవరం రూరల్ : అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బకాయిల విడుదల, ఐఆర్ ప్రకటన, ఓపీఎస్ అమలు, కేసుల ఎత్తివేత, 117 జీవో రద్దు కోరుతూ చేపట్టిన ధర్నాలో నాయకులు టి.త్రినాథ్, ఎస్.దుర్గారావు, ఎం.మహాలక్ష్మినాయుడు, బి.దేముడుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష శిబిరం విజయవంతం కావాలి

గొలుగొండ : జోగుంపేటలో శుక్రవారం జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం విజయవంతం కావాలని సిబ్బందికి గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం జరిగే జోగుంపేట ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. జోగుంపేట సచివాలయం పరిధిలో ఉన్న జోగుంపేట, సాలికమల్లవరం, వెంకటాపురం, పొగచెట్లపాలెం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించి వైద్య సేవలకు అధికంగా ప్రజలు వచ్చేలా పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది పని చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రఘు, సీహెచ్‌వో ప్రసాద్ పాల్గొన్నారు.

ఖండివరంలో..

చీడికాడ : జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం మండలంలోని ఖండివరంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపీపీ పాఠశాల ఆవరణలో జరిగే శిబిరంలో చీడికాడ వైద్య సిబ్బందితో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరవుతారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కింతాడలో..

కె.కోటపాడు : మండలంలోని కింతాడ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అప్పలరాజు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నలుగురు స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారని తెలిపారు.

ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తదితరులు

చోడవరం : ప్రాచీన దేవాలయాల్లో ఒకటైన చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వర స్వామి వారి వార్షిక కల్యాణం, మహా శివరాత్రి మహోత్సవాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను గురువారం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆవిష్కరించారు. మార్చి 6వ తేదీ నుంచి ప్రారంభమై 11వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. కరపత్రాల ఆవిష్కరణ అనంతరం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ఈ ఏడాది స్వామివారి ఉత్సవాలు వైభవంగా జరిపేందుకు భారీ ఏర్పాట్లు చేశామన్నారు. దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.వి. సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సత్తిబాబు, ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతి, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాక్సింగ్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



ఇండోర్ బాక్సింగ్ హాల్ నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ఏరియా ఆస్పత్రి సమీపంలోని పార్కు వద్ద గల ఇండోర్ బాక్సింగ్ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ రవిపటాన్‌శెట్టి స్పోర్ట్స్ సెస్ గ్రాంట్ నుంచి రూ.60 లక్షలు మంజూరు చేశారన్నారు. రూ.46 లక్షలతో ఆఫీస్, స్పోర్ట్స్ రూములు, టాయిలెట్ల బ్లాక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాక్సింగ్ మెటీరియల్‌కు రూ.14 లక్షలు ఖర్చు చేస్తామన్నారు. క్రీడాకారులకు అనువుగా ఉండాలనే ఉద్దేశ్యంతో బాక్సింగ్ హాల్‌ను ఇక్కడ నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు విద్య, వైద్యం, క్రీడలకు అంత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, జిల్లా స్పోర్ట్స్ అధికారి ఎల్.వి.రమణ, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీసా బేగం, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొణతాల వరలక్ష్మి, సూర్యచంద్ర, నూకాలతల్లి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో తాగునీటి ఎద్దడికి చెక్



మర్రిపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎంపీడీవో జాగారపు రాంబాబు అన్నారు. మండలంలో గురువారం మర్రిపాలెం, బెన్నవరం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో పర్యటించి డ్రైనేజీలు, తాగునీటి కుళాయిలను పరిశీలించారు. కులగణన సర్వే ఏ విధంగా చేశారని గ్రామస్తులను అడిగారు. సంక్షేమ పథకాలు వలంటీర్లు ఏ విధంగా అందిస్తున్నారని లబ్ధిదారులను ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో బోర్లు వేస్తున్నామన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటా కుళాయి పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కదారి పట్టిన నిధులు రికవరీ చేస్తాం



ప్రజావేదికకు హాజరైన అధికారులు

మాకవరపాలెం: పక్కదారి పట్టిన నిధులు రికవరీ చేస్తామని ఉపాధి పథకం అదనపు పీడీ రోజారమణి తెలిపారు. మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు రూ.16.4 కోట్ల నిధులతో జరిగిన ఉపాధి పనులు, పంచాయతీరాజ్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై ఈ నెల 16 నుంచి 28 వరకు సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తనిఖీల్లో గుర్తించిన అంశాలను వెల్లడించేందుకు గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో జరిగిన తనిఖీలపై ప్రత్యేక బృందాల్లో ఉన్న డీఆర్‌పీల వివరాలు వెల్లడించారు. కొన్ని గ్రామాల్లో మస్టర్ల రూపంలో రూ.30 వేల ఉపాధి నిధుల అవకతవకలు జరిగినట్టు వెల్లడించారు. అలాగే పంచాయతీ రాజ్ పనులకు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3 లక్షల 60 వేల విలువ చేసే సిమెంట్ కూడా పనులు చేయకుండా పక్కదారి పట్టినట్టు ప్రజావేదికలో తనిఖీ బృందాలు తెలిపాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, సామాజిక తనిఖీ విభాగం ఎస్ఆర్‌పీ రామారావు, ఏపీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ యాప్‌తో సత్వరం ఉచిత వైద్యం



ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల వైద్యం ఉచితంగా అందించనుందని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. మండలంలోని సింగన్నదొరపాలెంలో ఆరోగ్యశ్రీ యాప్‌ను గురువారం ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించారు. సెల్‌ఫోన్‌లో యాప్ ఉండడం వల్ల అత్యవసర సమయంలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఏఎన్‌ఎం చిన్నమ్మలు,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో వడ్డీ రాయితీ జమ



కలిగొట్ల ఆర్‌బీకేలో వడ్డీ రాయితీ జాబితాలను అతికిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి : వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకంలో రబీ 2021–22, ఖరీఫ్ 2022లో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వడ్డీ రాయితీని ఖాతాల్లో జమ చేశారని మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ తెలిపారు. ఈ మేరకు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో లబ్ధిదారుల జాబితా గురువారం ప్రదర్శించారు. కలిగొట్ల ఆర్‌బీకేలో లబ్ధిదారుల జాబితాను ఆమె ప్రదర్శించారు. రైతులు సరిచూసుకుని బ్యాంక్ ఖాతాల్లో కూడా చెక్ చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. కిరణ్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకానికి రుణాలు

కోటవురట్ల: పాడి రైతులకు పశు సంవర్ధక శాఖ ఆసరాగా ఉందని, గొర్రెలు, మేకల పెంపకానికి 50 శాతం రాయితీపై రుణాలు అందిస్తున్నామని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నరసింహులు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పశు వైద్య సిబ్బందితో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పశు సంవర్ధక శాఖ ద్వారా కలుగుతున్న లబ్ధిని వివరించి రైతులను ప్రోత్సహించాలని అన్నారు. రాయితీపై గడ్డి విత్తనాలు, మెషిన్లు కూడా అందిస్తున్నట్టు తెలిపారు.